క్లుప్తంగా

కృష్ణానదిలో నిలకడగా కొనసాగుతున్న వరద

తోట్లవల్లూరు: కృష్ణానదిలో వరద నిలకడగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధికారులు మూడు రోజులుగా దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. బ్యారేజీ నుంచి శుక్రవారం 2.96 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదలైంది. దీంతో నదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కరకట్ట వెంబడి గ్రామాల రైతులు, కూలీలు, లంక గ్రామాల ప్రజలు పడవలలో రాకపోకలు సాగిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టే వరకు లంక గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని డీటీ ధనలక్ష్మి పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పెదమద్దాలి(పామర్రు): రైతులు పంట నష్ట పరిహారం పొందాలంటే ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శివ నాగరాణి పేర్కొన్నారు. మండలంలోని పెదమద్దాలి, బల్లిపర్రు గ్రామాల్లో ఈ క్రాప్ నమోదుపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలు, తుపానులు తదితర కారణాల వలన పంట నష్టం ఏర్పడితే నష్ట పరిహారం చెల్లించాలంటే ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకుని ఉండాలన్నారు. పెదమద్దాలి ఆర్బీకే వ్యవసాయ సహాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి



గుడివాడ టౌన్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రైవేటీకరణ ఆపేందుకు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల అమ్మకాల నిలుపుదల, రైతులకు గిట్టుబాటు ధర, లేబర్ కోడ్ రద్దు తదితర అంశాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గించడంతో టోల్ గేట్‌లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.లక్ష్మణరావు, పి.రజిని, ఆర్.కొండ, అబ్దుల్ కుద్దూస్, బి.ఆంజనేయులు, బి.వీర్రాజు, రెడ్డి నాగరాజు, రెహ్మాన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

పామర్రు: కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి పి.రంగారావు అన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి, రైతు సమస్యలను పట్టించుకోకుండా అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర ప్రసాద్, కౌలు రైతు సంఘ నాయకులు శీలం నారాయణ, బరిగెల భీమేశ్వరరావు, విల్సన్, లక్ష్మణ, వెంకటేశ్వరరావు, నాగభూషణం, రఘునాథరావు, బసవయ్య పాల్గొన్నారు.

ఘనంగా విఘ్నేశ్వర స్వామి దేవస్థాన ప్రతిష్ట



గుడివాడ టౌన్: స్థానిక వాంబే కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ట వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: వివాహిత అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు ముదినేపల్లికి చెందిన ఓ వివాహిత గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబ కలహాల నేపథ్యంలో అలిగి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

300 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం

- రామనపూడి జెమీ పంట కాలువ పూడ్చివేత
- జాతీయ రహదారి విస్తరణలో కనుమరుగైన కాలువ

గుడివాడరూరల్: వందల ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించే రామనపూడి జెమీ పంట కాల్వ కనుమరుగైంది. పామర్రు–కత్తిపూడి 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పంట కాలువను అధికారులు రోడ్డులో కలిపేయడంతో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. రామనపూడి గ్రామంలోని జెమీ పంట కాలు ద్వారా ఆ గ్రామంలో 300 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. గ్రామంలోని నాలుగు ఊర చెరువులకు తాగునీరు ఈ కాలువ ద్వారానే చేరుతుంది. ఇటీవల పామర్రు–కత్తిపూడి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డును ఆనుకుని ఉన్న జెమీ పంట కాలువలను అధికారులు పూడ్చి రోడ్డులో కలిపేశారు. వాస్తవానికి విస్తరణ పనులకు ముందు అధికారులు గ్రామస్తులు, రైతులతో కాలువ విషయమై చర్చలు జరిపి జమీపంట కాలువ పరిధిలో ఉన్న పంట పొలాలకు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా కాలువ నిర్మించి ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన భరోసాతో రైతులు, ప్రజలు కాలువను పూడ్చేందుకు అంగీకరించారు. అధికారులు మాత్రం కాలువను పూడ్చినా ప్రత్యామ్నాయంగా పంట కాలువలను ఏర్పాటు చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆ పంట కాలువపై ఆధారపడి ఉన్న పంట పొలాల రైతులు నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడ్డారు. తూతూ మంత్రంగా అధికారులు చిన్నపాటి ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ లేకపోవడంతో అధిక వ్యయాన్ని భరించి నాట్లు వేసే ప్రక్రియ చేపట్టామని, దీని వలన ఇబ్బందులు పడ్డామని రైతులు లబోదిబోమంటున్నారు.



రహదారి విస్తరణలో పూడ్చేసిన రామనపూడి జెమీ పంటకాలువ

కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

జెమీ పంట కాలువ పూడ్చి ప్రత్యామ్నాయంగా కాలువను ఏర్పాటు చేస్తామని సదరు కాంట్రాక్టర్, అధికారులు ఇచ్చిన హామీని విస్మరించారని స్థానిక రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మించకముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ రైతులు, గ్రామప్రజలు అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. పంట కాలువ లేకపోవడంతో 300 ఎకరాలను వర్షం మీద ఆధారపడి సాగు ప్రక్రియ ముగించారు. ప్రస్తుతం పంటను కాపాడుకునేందుకు నీరు ఏ విధంగా అందుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులను ఈ విషయంలో జోక్యం చేసుకుని రైతులు, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులు నష్టపోతున్నారు



వందలాది ఎకరాలకు సాగునీరు అందించే రామనపూడి జెమీ పంట కాలువను పూడ్చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామని అధికారులు తొలుత హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన తర్వాత పట్టించుకోవడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరిగినా సమాధానం చెప్పేవారే లేరు. అధికారులు రైతుల బాధను అర్థ చేసుకోవాలని. కాలువను పునర్నిర్మించాలి

– మసిముక్కు సత్యనారాయణ, రైతు, రామనపూడి

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి

గుడివాడరూరల్: చెత్త నుంచి సంపదను తయారీ చేసే విధానాలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని తటివర్రు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు, పలు గ్రామాల సర్పంచ్‌లతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చెత్త నుంచి తడి, పొడి చెత్తలను వేరే చేసి సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రతి గ్రామంలోనూ చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో రోడ్లపై ప్రజలు చెత్త పడేయకుండా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి చెత్త సేకరణ పనులు ప్రతి రోజూ నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్క కార్యదర్శి చెత్త సేకరణపై దృష్టిసారించాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తటివర్రు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీని పరిశీలిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన లైన్ ఏర్పాటు నిమిత్తం పల్లెవాడ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: రెండో శనివారం పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ టి. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తం

■ గ్రామాల అభివృద్ధికి కృషి

పామర్రు: స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయంతో ఆయా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 82 సీసీ రోడ్లు, మూడు పాఠశాలల అభివృద్ధికి రూ.4.45 కోట్లతో అంచనాలు పంపించినట్లు తెలిపారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో మండల పరిషత్ సభ్యులు కూడా పాల్గొనే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎమ్మెల్యేతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

■ ఘనంగా శ్రావణ శుక్రవార పూజలు



గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ఆలయాలలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను పూలతో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పునీత్ శర్మ మాట్లాడుతూ అమ్మవారికి వేకువ జామునే అభిషేకాలు నిర్వహించామన్నారు.

ప్రత్యేక పూజలు

కైకలూరు: శ్రావణమాసం సందర్భంగా శ్యామలాంబ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారిని మహిళా భక్తులు అధికంగా దర్శించుకున్నారు. మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన దాత పి.నారాయణ అమ్మవారికి పూలాలంకరణ చేయించారు. భక్తులకు ఉచిత ప్రసాదదాతలుగా భక్తులు నారాయణ, అమిరపు వెంకట సూర్య అప్పారావు, సుబ్బారావు, ఇందుకూరి వెంకట రామరాజు, ముంజులూరి పవన్‌కుమార్, సాయి విజయ్ శ్రీరామ్, బుచ్చు నాగ వెంకట మురళీకృష్ణ వ్యవహరించారు.

తొలి శ్రావణ శుక్రవారం శోభ

కూచిపూడి(మొవ్వ): శ్రావణమాసంలో వచ్చిన తొలి శుక్రవారం నాడు మొవ్వ మండలంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండలంలోని నిడుమోలు, చినముత్తేవి, అయ్యంకి, కూచిపూడి, పెదపూడి, కోసూరు, మొవ్వ, కాజ, పెద ముత్తేవి, కారకంపాడు తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో కళకళలాడాయి. ఇందులో భాగంగా కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు పెనుమూడి సతీష్‌కుమార్, పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ పాపన్న గౌడ్ జయంత్యుత్సవాలకు తరలిరావాలి

ముదినేపల్లి రూరల్: శ్రీహరిపురం బాబా ఆలయం వద్ద జైగౌడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పరసా ఏడుకొండలు ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంత్యుత్సవాల ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు. పాపన్న గౌడ్ జయంత్యుత్సవాలు ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఏడుకొండలు తెలిపారు. నల్గొండ సామ్రాజ్యాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమానికి గౌడసంఘం నేతలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పోలగాని నాగరాజు, పోసిన పాండురంగారావు, నితిన్, దాసరి శ్రీనివాసరావు, బొల్లా రామ్మోహన్ పాల్గొన్నారు.

■ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బి అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ యువత స్వయంకృతాపరాధాల వలన బంగారు భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారన్నారు. అలా జరుగకుండా శ్రద్ధతో డిగ్రీ పూర్తి చేసుకుని మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరక్టర్ పి.కల్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు పాల్గొన్నారు.

■ పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ బహూకరణ

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ సభ్యులు స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ఆటోమేటిక్ ఎలక్ట్రికల్ బెల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ రూ. 10 వేలు విలువగల బెల్‌ను క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు వితరణగా అందజేశారన్నారు. కార్యక్రమంలో మాంటిస్సోరి సంస్థ అధ్యక్షురాలు వి.లక్ష్మి, కరస్పాండెంట్ పి.రమాదేవి, కోశాధికారి కె.రూన్సీ, హెచ్ఎం జి.పద్మావతి పాల్గొన్నారు.

■ సంపద కేంద్రాలను వినియోగించాలి

పెదపారుపూడి: గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకునిరావాలని ఎంపీడీఓ సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చెత్తనుంచి సంపద కేంద్రాల ద్వారా ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరం ఈదులమద్దాలిలోని చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

■ చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

గుడ్లవల్లేరు: చిన్నారులు ఎదిగే సమయంలో ఆరోగ్య జాగ్రత్తలను వారి తల్లిదండ్రులు తప్పక పాటించాలని గుడివాడ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బందారు అంకిత పేర్కొన్నారు. రెయిన్ బో డేను పురస్కరించుకుని శుక్రవారం గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో ఇంద్రధనస్సులో సప్త వర్ణబాలపై చిన్నారుల విచిత్ర వేషధారణ, నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, ఉపాధ్యాయులు శ్రీలత, శ్రీలక్ష్మి, నాగ శ్యామల, బాలా త్రిపురసుందరి పాల్గొన్నారు.

■ వడాలి కార్యదర్శిగా సంగమయ్య

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి పంచాయతీ కార్యదర్శిగా సంగమయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కార్యదర్శిగా పనిచేసిన జి.రమేష్ ఉద్యోగోన్నతిపై గుడివాడ రూరల్ మండలానికి బదిలీ అయ్యారు. సంగమయ్య ఆగిరిపల్లి మండలంలో గ్రేడ్–3 కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై గ్రేడ్–2 కార్యదర్శిగా వడాలి బదిలీ అయ్యారు. సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, సచివాలయ సిబ్బంది సంగమయ్యకు అభినందనలు తెలిపారు.

■ సమయపాలన పాటించని సంస్థలను రద్దు చేయాలి

గుడివాడ టౌన్: సమయపాలన పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఉదయం 7.45 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను బలవంతంగా చదివిస్తున్నారన్నారు. ఇది పూర్తిగా విద్యాహక్కు చట్టానికి విరుద్ధమన్నారు. తక్షణమే ఈ విధానాన్ని అవలంబిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలీమ్, పట్టణ కార్యదర్శి సమీర్, సభ్యులు సాయిరామ్, పవన్, కల్యాణ్, సురేష్ పాల్గొన్నారు.

■ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్నసమారాధన

గుడివాడ టౌన్: సూపర్‌స్టార్ ఘట్టమనేని మహేష్ బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్‌లో మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్నసమారాధన, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి. సురేష్, కె. నాని, వి.గిరి, రాజేష్, వి.శేఖర్, అనిల్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

■ తహసీల్దార్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

గుడివాడరూరల్: గుడివాడ తహసీల్దార్ రామకోటేశ్వరరావును ఏపీజీఈఏ నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, అధ్యక్షుడు కె.దుర్గేష్, సెక్రటరీ వి.రాజేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ జోజి, సబిత, రాంబాబు, ఆర్టీసీ రాజు, రమణ, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

■ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

గుడివాడ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని భారతీయ జనతాపార్టీ పిలుపునిచ్చినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. స్థానిక విడిది ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ కృష్ణాజిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో యువమోర్చ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గం లోనూ తిరంగ్ రన్ నిర్వహించాలన్నారు. 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ప్రతి ఇంటిపై స్వాతంత్ర్య జెండా ఎగురవేయాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు రామినేని వెంకట కృష్ణ, సూరే గాంధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, వి. శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ నేడు వీరమ్మ తల్లి దేవస్థాన శంకుస్థాపన

గుడ్లవల్లేరు: మామిడికోళ్లలో వందేళ్ల పైగా చరిత్ర కలిగిన శ్రీ వీరమ్మ తల్లి దేవస్థాన పునర్నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి

ఎంపీపీ పుష్పరాణి

గుడివాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు, సదుపాయాలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు పరిపాలన అంశాలపై రెండో రోజు నిర్వహించిన సదస్సులో శుక్రవారం ఎంపీపీ మాట్లాడారు. నూతనంగా ఎంపికైన కార్యదర్శులు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, నిర్వహణ తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీఓ కె.జ్యోతి మాట్లాడుతూ కార్యదర్శులు ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, కార్య నిర్వహణ అధికారి త్రినాథ్, వివిధ శాఖల అధికారులు, ఈఓలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ట్రైనర్, పక్కన ఎంపీపీ, ఎంపీడీఓ

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలనుకోవడం దారుణం

పామర్రు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహా శిల్పం ధ్వంసం చేయాలనుకోవడం దారుణమని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విజయవాడలో నిర్మించిన డాక్టర్ అంబేడ్కర్ సామాజిక మహా శిల్పాన్ని గురువారం రాత్రి కూల్చేందుకు కూటమి నాయకులు ప్రయత్నించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసేందుకు బరితెగించారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నియోజకవర్గంలోని అంబేడ్కర్ సంఘాల నాయకులు, అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమానుషం..

గుడివాడరూరల్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి పచ్చమూకలు ప్రయత్నించడం అమానుషమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. విగ్రహ ఏర్పాటుకు ఆది నుంచి వ్యతిరేకిస్తున్న పచ్చ మూకలు అధికారంలోకి రాగానే విగ్రహ ధ్వంస రచనకు పూనుకోవడం దారుణమన్నారు. అక్కడ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పామర్రులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రాజ్యాంగ నిర్మాతను అగౌరవపర్చడమే

గుడివాడ టౌన్: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో టీడీపీ గూండాలు పాల్పడిన దుర్మార్గపు చర్యలను ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ. నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిమాంధ్ర సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు దీనిపై స్పందిస్తూ అంబేడ్కర్ భవన్‌లో ఏ ఒక్క అక్షరం, రాయి, రంగు కదిపినా అది అంబేడ్కర్‌ను అవమానించినట్లే అవుతుందన్నారు.

సాగునీరు లేక.. ట్రాక్టర్‌తో నారుమడుల ధ్వంసం

వేములమడ(మొవ్వ): సాగునీటి కోసం రోడెక్కినా ఫలితంలేక, ఎండుతున్న నారుమడులను చూడలేక దమ్ము చక్రాల ట్రాక్టర్లతో తొక్కొంచిన ఘటన మొవ్వ మండలంలోని వేములమడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మొవ్వ మండలం వేములమడ, రుద్రవరం, తురకపాలెం గ్రామాల్లో సుమారు 80 ఎకరాల వరిసాగు పైరు ప్రశ్నార్థకంగా మారింది. ఏడు సంవత్సరాలుగా వేములమడ–రుద్రవరం కాలువకు ఇరువైపులా గల పొలాలకు సాగు నీటి కొరత ఏర్పడటం.. రైతులు తిరుగుబాటు చేయటంతో ఎట్టకేలకు సాగు నీరు విడుదల చేయటం పరిపాటిగా మారింది. ఈ ప్రాంత పొలాల కోసం 1986లో వేములమడ భీమ డ్రెయిన్‌పై నాటి రైతు నాయకులు వడ్డీ రంగారావు నేతృత్వంలో పోరాటాలు చేయగా ఏడు కానాల డ్రాప్‌ని వేములమడలో నిర్మించారు. దాని వలన ఆ ప్రాంత రైతులకు మేలు జరిగినప్పటికీ కొండవరం సమీపంలోని లంబాడి కాలువలోకి నీరు వచ్చేందుకు గతంలో మూడు అడుగుల తూము ఉండేదని.. దానిని ఏడు సంవత్సరాల క్రితం తొలగించి అడుగు తూము వేశారు. దీని వలనే నేడు ఈ సాగు నీటి కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. దీని పై అధికారులు స్పందించి తక్షణ శాశ్వత పరిష్కారం చూపి ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.



దమ్ము చక్రాల కింద నలుగుతున్న నారుమడి

రైతులను ఆదుకోవాలి

నాది మొవ్వ మండలం వేములమడ గ్రామం. ఈ ప్రాంతంలో నేను 12 ఎకరాలు వరి సాగు చేస్తున్నా. సాగు నీరు లేక ఐదు ఎకరాల వరి నారు, ఏడు ఎకరాల నాటు వేసిన పొలం ఎండిపోయింది. నేడు దమ్ముచక్రాలతో తొక్కొంచి వేశాను. సుమారు రూ.2 లక్షల మేర నష్టం కలిగింది. దీనిపై శాశ్వత పరిష్కారం కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నా.

–వడ్డీ వెంకటేశ్వరరావు, రైతు నాయకుడు

ఇబ్బంది పడుతున్నాం

నాది మొవ్వ మండలం వేములమడ గ్రామం. మా గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయం చేస్తున్నా. ఎన్నో సంవత్సరాలుగా సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రధానంగా బోర్ల పైనే వ్యవసాయం చేసే పరిస్థితి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మా ప్రాంత రైతులు కోరుకుంటున్నారు.

–సిద్దెల వెంకటేశ్వరరావు, రైతు

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

పెదపారుపూడి: పెదపారుపూడి ఎస్ఐగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పామర్రు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. గ్రామాల్లో జూదాలు జరుగుతుంటే సమాచారం అందిస్తే దాడులు చేస్తామన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

పామర్రు ఎస్ఐగా అవినాష్

పామర్రు: పామర్రు ఎస్ఐగా సీ అవినాష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బదిలీపై పెదపారుపూడికి వెళ్లారు. ఎస్ఐ అవినాష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది సాయంతో చర్యలు తీసుకుంటామన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

మండవల్లి: పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటమణి రైతులకు సూచించారు. లింగాలలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఏడీఏ వెంకటమణి, ఏఓ ఎస్‌కే జరీనా పాల్గొని రైతులకు సస్యరక్షణపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా పొలంబడి సూత్రాలను వివరించారు. ఆరోగ్యకరమైన పంట పండించడం, తరచుగా పొలాన్ని సందర్శించడం, మిత్ర, శత్రు పురుగుల ఆవశ్యకతను తెలియజేయడం, సమగ్ర పురుగుల యాజమాన్యం, రైతు నిర్ణయాధికారం తీసుకునే విధంగా తయారు చేయడం పొలంబడి ఉద్దేశమన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా మాట్లాడుతూ పొలంలో పురుగు కనబడగానే రసాయన పురుగుమందులు చల్లకుండా సాగు జీవ నియంత్రణ యాంత్రిక నియంత్రణలు చేపట్టి, చివరి అస్త్రంగా మాత్రమే రసాయనాలు పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏలు వర్మ, గోపాల్, సంధ్య, చాప్లిన్, దినేష్, ఆకాంక్ష, సుభాని, మాస్టర్ ట్రైనర్ నాగవిజయ, పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్యం అవసరం

గుడివాడ టౌన్: వృత్తి విద్య కోర్సుల్లో సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యం పెంపుదలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి. గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ వ్యవస్థలో నైపుణ్యం గలవారికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉపాధి కల్పన అధికారి విక్టర్‌బాబు, ప్రిన్సిపాల్ గౌరిమణి పాల్గొన్నారు.